క్లుప్తంగా

రైతు బీమాకు దరఖాస్తులు

డోర్నకల్/గూడూరు: భూభారతి పోర్టల్ ద్వారా కొత్తగా పట్టా పాసుపుస్తకం వచ్చిన రైతులు రైతు బీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి మురళీమోహన్, ఎండీ అబ్దుల్‌మాలిక్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. 18నుంచి 59సంవత్సరాల మధ్య వయసు కలిగి 2025 జూన్ 5వ తేదీ వరకు రెవెన్యూ పట్టా లేదా ఆర్‌ఓఆర్ పట్టా పొందిన రైతులు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని తెలిపారు. గతంలో దరఖాస్తు చేసిన వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని, రైతు బీమాలో నామిని, ఫోన్ నంబర్ మార్చుకునే అవకాశం ఉందన్నారు.

మహిళల రక్షణే లక్ష్యం

నెల్లికుదురు: మహిళల రక్షణే షీ టీం లక్ష్యమని ఎస్సై చిర్ర రమేష్ బాబు, షీటీం ఎస్సై సునంద అన్నారు. ఎస్పీ ఆదేశాలతో నెల్లికుదురు పోలీసులు, షీటీం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని మోడల్ స్కూల్, జూనియర్ కళాశాల విద్యార్థులకు సోమవారం కళాజాతా ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో షీటీం సిబ్బంది అరుణ, రమేష్, సౌభాగ్య, ఏఎస్సై వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

అభినందనీయం

తొర్రూరు రూరల్: ప్రభుత్వ బడుల అభివృద్ధికి దాతల కృషి అభినందనీయమని అన్నివర్గాల ప్రజలు భాగస్వాములు కావాలని ఎంఈఓ మహంకాళి బుచ్చయ్య కోరారు. సోమవారం మండలంలోని గోపాలగిరి ప్రాథమిక పాఠశాలకు రూ.16వేల విలువ చేసే మినీ వాటర్ ట్యాంక్ పరికరాలు, సీలింగ్ ఫ్యాన్లను శ్రీప్రియ ఆస్పత్రి డాక్టర్ భూక్యా అనిల్‌కుమార్ సొంత ఖర్చులతో అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ప్రేమలత, యూత్ నాయకుడు ఎనమాల రాకేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో తనిఖీలు

డోర్నకల్: స్థానిక రైల్వేస్టేషన్‌లో సోమవారం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. డోర్నకల్ సీఐ బి.రాజేష్ ఆధ్వర్యంలో నార్కోటిక్స్‌లో శిక్షణ పొందిన నార్కో స్నైపర్ డాగ్‌తో స్టేషన్ పరిసరాలతోపాటు ప్లాట్‌ఫారాలపై తనిఖీలు నిర్వహించారు. కార్యక్రమంలో సీఐతోపాటు ఎస్సైలు గడ్డం ఉమ, వంశీధర్ పాల్గొన్నారు.

నేషనల్ చాంపియన్ షిప్ జట్టులో మరిపెడ వాసి



మరిపెడ రూరల్: ఆల్ ఏజ్ గ్రూప్ ట్రామ్పోలిన్, టంబ్లింగ్ జిమ్నాస్టిక్స్ నేషనల్ చాంపియన్ షిప్ తెలంగాణ జట్టులో మరిపెడ మండల కేంద్రానికి చెందిన బి.సంజీవకుమార్ పాల్గొన్నాడు. ఈనెల ఆగస్టు 8నుంచి 10వ తేదీ వరకు ఉత్తరాఖండ్ రాష్ట్రం డెహ్రాడూన్‌లోని మహారాణా ప్రతాప్ స్పోర్ట్స్ కాలేజీలో జిమ్నాస్టిక్ నేషనల్ చాంపియన్ షిప్ పోటీలు నిర్వహించారు.

తీజ్ వేడుకలు

డోర్నకల్: మండలంలోని గుర్రాలకుంటతండాలో సోమవారం తీజ్ వేడుకలు ముగిశాయి. తీజ్ వేడుకల ముగింపు సందర్భంగా తీజ్ బుట్టలతో మహిళలు ఊరేగింపు నిర్వహించి, తండా సమీపంలోని మున్నేరువాగులో నిమజ్జనం చేశారు.

స్థల పరిశీలన

బయ్యారం: మండల కేంద్రంలో 133/33 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణానికి అవసరమైన స్థలంను సోమవారం తహసీల్దార్ నాగరాజు, ఎన్‌పీడీసీఎల్ ఏడీఈ మోహన్, ఏడీఏ రమేశ్, ఏఈ సుమన్ బయ్యారం దామెర చెరువు సమీపంలో ఉన్న 5ఎకరాల ప్రభుత్వ భూమిని పరిశీలించారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క పర్యటన సందర్భంగా సబ్‌స్టేషన్ నిర్మాణానికి హామీ ఇచ్చారని, ఆ హామీ మేరకు స్థల పరిశీలన చేసినట్లు తెలిపారు.

బురదరోడ్లపై నిరసన



చిన్నగూడూరు: మండలంలోని మన్నెగూడెం గ్రామంలో అంతర్గత రోడ్లు బురదమయంగా మారి పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. దీంతో గ్రామస్తులు బురద నీటిలో నిలబడి సోమవారం నిరసన వ్యక్తం చేశారు. గ్రామస్తులు బొమ్మకంటి వెంకట్, కుర్ర సోమన్న, బొడ్డు భిక్షం, రాసమల్ల వీరన్న పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్లు

మహబూబాబాద్: అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ప్రభుత్వం మంజూరు చేస్తుందని వార్డు ఇందిరమ్మ ఇళ్ల కమిటీ అధ్యక్షుడు కాటా భాస్కర్ తెలిపారు. మానుకోట మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డులో సోమవారం లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు.

జాతీయ సమ్మేళనానికి ఆహ్వానం

మహబూబాబాద్ అర్బన్: ఈనెల 12, 13 తేదీలో గుజరాత్‌లోని అహ్మదాబాద్, గాంధీనగర్‌లో జరగనున్న జాతీయస్థాయి బంజార సమ్మేళనానికి మాజీ ఎంపీ, ప్రొఫెసర్ అజ్మీరా సీతారాం నాయక్‌కు ఆహ్వానం అందింది.

‘ఆసరా’ కోసం ఎదురుచూపులు

- కొత్తవారికి నాలుగేళ్లుగా రాని పింఛన్లు
- వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళల నిరీక్షణ

గూడూరు: మండలంలోని ఎంతో మంది వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు ఆసరా పింఛన్ అందక ఇబ్బందులు పడుతున్నారు. అన్ని అర్హతలు ఉన్నా ఆసరా పింఛన్ అమలు కోసం ఎదురుచూస్తున్నారు. రాష్ట్రంలోని గత ప్రభుత్వం పాత లబ్ధిదారులకు ఆసరా పింఛన్ అందజేసినా, కొత్త వారికి అమలు చేయలేదు. దీంతో నాలుగేళ్లుగా కొత్త వారు పింఛన్ అమలు కోసం నిరీక్షిస్తున్నారు. ఇప్పటి వరకు కొత్త వారికి ఆసరా పింఛన్ పథకం అమలు కాకపోవడంతో మండలంలోని అనేక గ్రామాల్లో అర్హులైన లబ్ధిదారులు ఆసరా పథకానికి దూరమవుతున్నారు. కొత్త ప్రభుత్వం అయినా కొత్త వారికి ఆసరా అవకాశం ఇస్తుందని భావించినా ఏడాదిగా ఎదురుచూపులు తప్పడంలేదు. గత ఏడాది క్రితం కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పథకాల అమలుకు దరఖాస్తులు స్వీకరించింది. ఇప్పటి వరకు కొత్త వారికి ఆసరా పింఛన్‌లు మంజూరు చేయలేదు.



మండల పరిషత్ కార్యాలయం

ఎన్నోసార్లు దరఖాస్తు ఇచ్చిన..



నా భర్త చనిపోయి మూడు సంవత్సరాలు దాటింది. ప్రభుత్వం ఇచ్చే ఆసరా పింఛన్ కోసం ఎన్నోసార్లు దరఖాస్తు చేశాను. కానీ ఇప్పటి వరకు పింఛన్ రాలేదు. చేపలు అమ్ముకుంటూ, కూలీ పనులకు వెళ్తూ జీవనం గడుపుతున్నా. నాకు ఆసరా పింఛన్ అందించి ఆదుకోవాలి.

– గడ్డం పద్మ, వితంతువు, గూడూరు

రాష్ట్రంలో త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కొత్త వారికి ఆసరా పథకం అమలు చేస్తుందని భావిస్తున్నారు.

ఎన్నిక ఏదైనా కాంగ్రెస్‌దే విజయం

- టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీరెడ్డి

తొర్రూరు: ఇప్పటికిప్పుడు ఏ ఎన్నిక వచ్చినా కాంగ్రెస్ పార్టీనే విజయం సాధిస్తుందని టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సీనియర్ నాయకులు డాక్టర్ పానుగోటి సోమేశ్వరరావుతో కలిసి ఝాన్సీరెడ్డి మాట్లాడుతూ.. పేదలకు మంచి చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆశీర్వదించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి స్థానిక సంస్థల ఎన్నికల్లో మంచి ఫలితం అందించాలన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హామ్యానాయక్, పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేఖర్, నాయకులు మంగళపల్లి రామచంద్రయ్య, సురేందర్‌రెడ్డి, అలువాల సోమయ్య, జలగం శ్రీను, గజానంద్, పంజా కల్పన పాల్గొన్నారు.



తొర్రూరు: మాట్లాడుతున్న ఝాన్సీరెడ్డి

పరామర్శ..

పెద్దవంగర: కాంగ్రెస్ బలోపేతం చేయడం కోసం ప్రతి కార్యకర్త గ్రామస్థాయిలో శ్రమించాలని టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని పలు గ్రామాలను ఆమె సందర్శించారు. అనంతరం ఇటీవల మృతి చెందిన కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ముద్దసాని సురేష్, బానోతు గోపాల్, శ్రీనివాస్, రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

విపత్తులపై అవగాహన కలిగి ఉండాలి

మహబూబాబాద్ అర్బన్: విద్యార్థులు జాతీయ విపత్తులపై అవగాహన కలిగి ఉండాలని ఫైర్ ఆఫీసర్ టి.మోహన్ రావు, ఎన్‌డీఆర్‌ఎఫ్ ఇన్‌స్పెక్టర్ భూపేంద్రకుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో జాతీయ విపత్తులపై అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. మంటలు, వరదలు, అగ్నిప్రమాదం వచ్చినప్పుడు, రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు అప్రమత్తంగా ఉండి బాధితులకు సహాయం అందించాలన్నారు. 100, 108, 101 నంబర్లకు ఫోన్ చేయాలన్నారు. రైలు ప్రమాదాలు సంభవించినప్పుడు ప్రాణనష్టం జరగకుండా ప్రమాదబారిన పడిన వారిని రక్షించాలన్నారు. పోలీసు, అంబులెన్స్, అగ్నిమాపక దళం వంటి వివిధ అత్యవసర సేవలను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సిరినాయక్, మురళీ, కేవీరెడ్డి, శ్రీనివాస్, వెంకటేష్, సచిన్, బాలాజీ, ధర్మేంద్ర ఫైర్‌మన్ రమేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భూపేంద్రకుమార్

సద్వినియోగం చేసుకోవాలి

కురవి: సాగులో యాంత్రీకరణ కోసం సబ్సిడీ పరికరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మరిపెడ ఆత్మ కమిటీ చైర్మన్ నల్లు సుధాకర్‌రెడ్డి, ఏడీఏ విజయచందర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతువేదికలో వారు మాట్లాడుతూ.. రైతులకు ప్రభుత్వం అందించే సబ్సిడీ పరికరాలను ఉపయోగించాలన్నారు. ఈనెల 16 వరకు మండల వ్యవసాయ అధికారులు, ఏఈఓలకు దరఖాస్తులు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ నరసింహారావు, ఏఈఓలు రాజేశ్వరీ, విజయేందర్, రవళి పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాను నిర్మూలించాలి



మాట్లాడుతున్న మేనేజర్ చంద్రయ్య

మహబూబాబాద్ అర్బన్: మానవ అక్రమ రవాణా నిర్మూలించడం అందరి బాధ్యత అని ప్రజ్వల ప్రాజెక్ట్ సీనియర్ మేనేజర్ వై.చంద్రయ్య అన్నారు. మానుకోట మున్సిపల్ పరిధిలోని అనంతారం మోడల్ స్కూల్‌లో సోమవారం మానవ అక్రమ రవాణా నిర్మూలనపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రయ్య మాట్లాడుతూ.. మానవ అక్రమ రవాణతో దేశవ్యాప్తంగా ఎంతో మంది యువతులు, బాలికలు మిస్సింగ్ అవుతున్నారని, పాఠశాలలో ఉపాధ్యాయులు సదస్సులు నిర్వహించి అవగాహన కల్పించాలన్నారు. డీఈఓ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ.. మానవ అక్రమ రవాణ ఆదిలోనే అడ్డుకుంటే ఆడపిల్లలను రక్షించుకోవచ్చని, బాలికలు ఆత్మస్థైర్య విద్యలు నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో జీసీడీఓ విజయకుమారి, ప్రిన్సిపాల్ ఉపేందర్‌రావు, రిసోర్స్‌పర్సన్లు ఉషారాణి, లక్ష్మి పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల్లో ఇష్టారాజ్యం



కార్యదర్శి, ఎఫ్‌ఏపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న డీఆర్‌డీఓ మధుసూదన్‌రాజు

మహబూబాబాద్ రూరల్: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా కూలీలకు ఉపాధి కల్పించేందుకు చేపట్టిన పనుల్లో సంబంధిత అధికారులు, సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరించినట్లు సామాజిక తనిఖీ ప్రజావేదికలో వెల్లడైంది. ఎంఎస్‌ఆర్‌ఈజీఎస్ 16వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక మహబూబాబాద్ ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో సోమవారం ఏర్పాటు చేశారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అధికారి మధుసూదన్ రాజు సమక్షంలో సామాజిక తనిఖీ ద్వారా వివరాలు సేకరించిన డీఆర్పీలు వారి నివేదికను చదివి వినిపించారు. చాలావరకు ఉపాధి హామీ కూలి పనికి వచ్చిన వారి స్థానంలో మస్టర్లు లేకుండా, సంతకాలు తీసుకోకుండా, ఒకరికి బదులు మరొకరు పనులు చేసినట్లుగా తప్పులు దొర్లాయని సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. వివరాల నివేదికను మంగళవారం అందజేస్తారని ఎంపీడీఓ రఘుపతి రెడ్డి తెలిపారు. సమావేశంలో సామాజిక తనిఖీ అంబుడ్స్ మెన్ ఆదాం, ఏపీఓ రమేష్ రెడ్డి, ఎంపీఓ పార్థసారథి పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణే లక్ష్యం

జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా సోమవారం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. గూడూరు మండలంలోని దామరవంచ గ్రామంలో మాత్రల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే మురళీనాయక్ పాల్గొని మాట్లాడారు. 1నుంచి 19 సంవత్సరాల లోపు పిల్లలలో ఉండే ఈ సమస్యను నిర్మూలించడానికి ప్రభుత్వం మాత్రలు పంపిణీ చేస్తుందన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



గూడూరు: విద్యార్థికి ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్



చిన్నగూడూరు: కేజీబీవీలో..



మరిపెడ: హైస్కూల్‌లో..



తొర్రూరు: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో..



పెద్దవంగర: మాత్రలను వేస్తున్న ఎంపీడీఓ

పథకాలను ప్రచారం చేయాలి

డోర్నకల్: కాంగ్రెస్ ప్రభుత్వం పేదలు, రైతుల కోసం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లో విస్తృతంగా అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల శ్రీనివాస్‌యాదవ్ కోరారు. మండలంలోని సీతారాంపురం, తహసీల్దార్ బంజర, అమ్మపాలెం గ్రామాల్లో సోమవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇందిరమ్మ పల్లెప్రగతి యాత్ర నిర్వహించారు. గ్రామాల్లో ర్యాలీ నిర్వహించిన అనంతరం మొక్కలు నాటి శ్రమదానం చేసి పరిసరాలను శుభ్రపరిచారు. ఈసందర్భంగా శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ.. సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లో ప్రచారం చేస్తూ రాబోయే ఎన్నికల కోసం మద్దతు కూడగట్టాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కాలం రవీందర్‌రెడ్డి, తాళ్లూరి హనుమంతరావు, లాలునాయక్, ఆంగోత్ వెంకన్న, ఐలయ్య, వెంకటేశ్వర్లు, రామారావు, విష్ణువర్ధన్‌రెడ్డి, నలమాస రమేష్, రవి, చిర్రా శ్రీను పాల్గొన్నారు.



పథకాలపై ప్రచారం చేస్తున్న శ్రీనివాస్‌యాదవ్

గీతకార్మికులు సభకు తరలిరావాలి



నర్సింహులపేట: కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

నర్సింహులపేట: జిల్లా కేంద్రంలోని ఈనెల 16న తేదీన సర్వాయి పాపన్న విగ్రహ ఆవిష్కరణ సభను విజయవంతం చేయాలని కల్లు గీత కార్మిక సంఘం జిల్లా నాయకులు గునుగంటి మోహన్ పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో అమరుల యాదిలో భాగంగా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గీత కార్మికుల సమస్యల కోసం అమరులైన వారిని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో దొనికన రామన్న, గాడిపెల్లి రవి, వెంకన్న, లింగన్న, పురుషోత్తం, ముత్తయ్య, సతీష్, ప్రభాకర్, సోమయ్య పాల్గొన్నారు.

దంతాలపల్లి: ఈనెల 16న జిల్లా కేంద్రంలో సర్వాయి పాపన్న విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి గీత కార్మికులు తరలిరావాలని గౌడ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు బండి దీపక్ గౌడ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన సంఘం ఆయన మాట్లాడారు. అనంతరం మండల యువజన విభాగం కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ముర్ర ముత్తు, ప్రధాన కార్యదర్శిగా దొరపెల్లి యాకన్న, కోశాధికారిగా శేశగాని మధు, మల్లం ప్రవీణ్‌లను ఎన్నుకున్నారు.

ఎస్సై చొరవతో వృద్ధురాలికి పింఛన్

కురవి: మండలంలోని అయ్యగారిపల్లి గ్రామానికి చెందిన రేఖ సమ్మక్క అనే వృద్ధురాలికి కురవి ఎస్సై గండ్రాతి సతీష్ చొరవతో పెన్షన్ డబ్బులు ఇప్పించిన సంఘటన సోమవారం వెలుగుచూసింది. వివరాలు ఇలా ఉన్నాయి. గత ఏడాది రేఖ సమ్మక్క తప్పిపోయింది. తప్పిపోయిన విషయాన్ని అయ్యగారిపల్లి గ్రామస్తులు కురవి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్సై సతీష్ దర్యాప్తు చేశారు. సమ్మక్క ఆచూకీ ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో దొరకడంతో ఆమెను ఇక్కడికి గత కొన్ని నెలల క్రితం రప్పించాడు. అప్పటికే ఆమెకు వస్తున్న పెన్షన్ 10 నెలలుగా తీసుకోలేదు. దీంతో పెన్షన్ నిలిచిపోయింది. ఎస్సై సతీష్ చొరవ తీసుకుని ఉన్నతాధికారులతో మాట్లాడి పెన్షన్ డబ్బులు వచ్చేలా ఏర్పాట్లు చేశారు. ఈనెల నిలిచి పోయిన పెన్షన్ పునరుద్దరణ కావడంతో పెన్షన్ డబ్బులను అనిల్‌కుమార్‌దేశ్‌ముఖ్ సహకారంతో యువకులు దూదిమెట్ల కార్తీక్, నూకల రమేష్, బుర్ర ఉదయ్, నర్సింగం ఉదయ్, రాఖీ, పండు, సందీప్, వినయ్, యాకన్న, వినోద్‌లు వృద్ధురాలు సమ్మక్కకు అందజేశారు. పోయిన పెన్షన్ వచ్చేలా కృషి చేసిన ఎస్సై సతీష్‌కు గ్రామస్తులు, వృద్ధురాలు కృతజ్ఞతలు తెలిపారు.



పెన్షన్ డబ్బులు అందిస్తున్న యువకులు

పులి కాదు.. హైనా అడుగులు

గూడూరు: గూడూరు మండలం పొనుగోడు శివారు పాకాలవాగు సమీప వరి పంటపొలాల్లో సోమవారం ఉదయం కనిపించిన పాద ముద్రలు పులివి కాదని, హైనా అడుగులు అని ఫారెస్టు అధికారులు తెలిపారు. వరి పంట పొలాల్లో ఉదయం పులి లేదా హైనాకు సంబంధించిన అడుగులు రైతులు గుర్తించి గూడూరు ఫారెస్టు అధికారులకు సమాచారం అందించారు. వెంటనే అక్కడికి చేరుకున్న అధికారులు ఆ గుర్తులను గుర్తించి, హైనా విగా తేల్చారు.



సంక్షిప్త సమాచారం

కంటి వైద్యశిబిరం

నెల్లికుదురు: మండలంలోని స్థానిక విశ్రాంతి భవనం ఆవరణంలో సోమవారం ప్రగతి సేవాసమితి ఆధ్వర్యంలో హైదరాబాద్ శంకర కంటి ఆసుపత్రి వారి సహకారంతో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ వెంకటేశ్వర్లు, మండల కోఆర్డినేటర్ చెడుపాక వెంకన్న, మేనేజ్‌మెంట్ రాజు పాల్గొన్నారు.

టీషర్టుల పంపిణీ



మహబూబాబాద్ రూరల్: పేద విద్యార్థులకు స్ఫూర్తి సంస్థ సహకారం అందిస్తుందని స్ఫూర్తి ఎడ్యుకేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు రామసహాయం శ్రీధర్ రెడ్డి అన్నారు. తెలుగు సమితి ఆఫ్ నేబ్రాస్కా, స్ఫూర్తి ఎడ్యుకేషన్ రూరల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో మండలంలోని కొమ్ముగూడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు టీషర్టులు పంపిణీ చేశారు.

పోస్టర్ల ఆవిష్కరణ

డోర్నకల్: సీపీఐ నాల్గో రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పార్టీ మండల కార్యదర్శి తురక రమేష్ కోరారు. స్థానిక రైల్వేస్టేషన్ సెంటర్‌లో సోమవారం రాష్ట్ర మహాసభలకు సంబంధించిన ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు నెల్లూరు నాగేశ్వర్‌రావు, ప్రభేష్, జెన్నె స్వామి పాల్గొన్నారు.

సకాలంలో బస్సును నడపాలి

కురవి: మండలంలోని నేరడలోని మోడల్ స్కూల్‌కు మానుకోట ఆర్టీసీ డిపో బస్సు సర్వీస్‌ను సకాలంలో సమాయానికి నడపాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గంధసిరి జ్యోతిబసు, పట్ల మధులు సోమవారం మానుకోటలోని డిపో సూపరింటెండెంట్ శ్రీమన్నారాయణకు వినతిపత్రం అందజేశారు.

పింఛన్ పెంచి ఇవ్వాలి

కేసముద్రం: ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం ఆసరా పింఛన్ పెంచాలని ఎంఎస్‌పీ జిల్లా ఇన్‌చార్జ్ చిన్న సుబ్బారావు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. ఈనెల 19న మరిపెడలో నిర్వహించనున్న డోర్నకల్ నియోజకవర్గ సన్నాహక సమావేశాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలేపాక శంకర్, నాయకులు వెంకన్న, సుమన్, సూరయ్య, సుదర్శన్ పాల్గొన్నారు.

ఇంటింటా జాతీయ జెండా ఎగరాలి

డోర్నకల్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆగస్టు 15న ఇంటింటా జాతీయ జెండాను ఎగురవేసి జాతీయ స్ఫూర్తిని నింపాలని బీజేపీ మండల అధ్యక్షుడు బానోత్ గణేష్‌నాయక్ కోరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన తిరంగా యాత్ర మండల స్థాయి సమావేశంలో గణేష్‌నాయక్ మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు దారావత్ నరేష్, గుగులోత్ దేవిక, గుగులోత్ శంకర్‌నాయక్, దేవానాయక్ పాల్గొన్నారు.

108లో ప్రసవం

బయ్యారం: మండలంలోని ఉప్పలపాడు గ్రామానికి చెందిన ఎస్.నవితకు పురిటినొప్పులు రావటంతో కుటుంబసభ్యులు 108కు ఫోన్ చేశారు. సమాచారం తెలుసుకున్న వాహన సిబ్బంది నవితను జిల్లా ఆసుపత్రికి తరలిస్తున్న క్రమంలో నొప్పులు ఎక్కువ కావడంతో వాహనంలోనే ఈఎంటీ చంద, పైలెట్ నెహ్రూ కాన్పు నిర్వహించడంతో మగబిడ్డకు జన్మనిచ్చింది.

బహుజన వీరుడు మొగిలయ్యగౌడ్

నెహ్రూసెంటర్: నిజాంకు వ్యతిరేకంగా పోరాటం చేసిన బహుజన వీరుడు బత్తిని మొగిలయ్యగౌడ్ అని గౌడ జన హక్కుల సమితి జిల్లా అధ్యక్షుడు ముంజాల రాజేందర్‌గౌడ్ అన్నారు. పట్టణంలోని మొగిలయ్య వర్ధంతి సందర్భంగా సోమవారం నివాళులర్పించారు. కార్యక్రమంలో జెర్రిపోతుల వెంకన్న, గండి వీరేందర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇవ్వాలి

దంతాలపల్లి: గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయ కూలీలందరికీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇవ్వాలని ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి ముంజపెల్లి వీరన్న అన్నారు. మండలంలోని పెద్దముప్పారం, కుమ్మరికుంట్ల, ఆగపేట గ్రామ పంచాయతీల వద్ద సోమవారం వ్యవసాయ కార్మికులు కార్యదర్శులకు వినతిపత్రాలు అందించారు. కార్యక్రమంలో ఊడుగుల రాములు, సెగ్గం యాకయ్య, దూదిమెట్ల లింగయ్య, ఉప్పలయ్య పాల్గొన్నారు.

యూరియా కొరత తీర్చాలి

తొర్రూరు: యూరియా కొరత తీర్చాలని రైతు సంఘం మండల కార్యదర్శి కొత్త వెంకట్‌రెడ్డి స్పష్టం చేశారు. యూరియా కొరత తీర్చాలని డిమాండ్ చేస్తూ సోమవారం డివిజన్ కేంద్రంలోని పీఏసీఎస్ యూరియా పాయింట్ వద్ద రైతులు ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో మాలోతు సురేష్‌బాబు, సంతోష్, యాకన్న, వీరన్న పాల్గొన్నారు.

మంత్రి పరామర్శ..

గూడూరు: మండలంలోని రాములుతండాకు చెందిన జిల్లా కాంగ్రెస్ మహిళా విభాగం అధ్యక్షురాలు నూనావత్ రాధ, భర్త వీరూనాయక్ ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. సోమవారం మంత్రి సీతక్క బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

హైస్కూల్‌కు బీరువా బహూకరణ



మరిపెడ రూరల్: మండలంలోని చిల్లంచర్ల హైస్కూల్‌కు 2024–25 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు సోమవారం బీరువా బహూకరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మంద జయ, ఉపాధ్యాయులు యాకయ్య, కవిత, శ్రీనివాస్, మేరుగు భాస్కర్, శాంసన్, పూర్వ విద్యార్థులు ఉమేష్, గణేష్, అక్షయ, మేఘన, దివ్య, స్పందన పాల్గొన్నారు.

శంకుస్థాపన

పెద్దవంగర: శ్రీకఠమహేశ్వర స్వామి కృపతో గ్రామం సస్యశ్యామలంగా ఉంటుందని గోపా సంఘం జిల్లా అధ్యక్షుడు కుర్ర శ్రీనివాస్ గౌడ్ అన్నారు. సోమవారం మండలంలోని అవుతాపురం గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో శ్రీ కఠమహేశ్వర స్వామి ఆలయానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్ గౌడ్ పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో గోపా కార్యవర్గ సభ్యులు నిమ్మల వెంకన్న గౌడ్, నాయకులు సదానందం, సంపత్, సోమన్న, సత్తయ్య, భిక్షపతి, యాకయ్య, సత్యనారాయణ, సోమన్న పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

గూడూరు: పురుగుల మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని బొల్లెపల్లిలో సోమవారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సట్ల యాదగిరి (58)కి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉండగా, పెళ్లిళ్లు అయ్యాయి. గొడవల వల్ల కొంతకాలం వేర్వేరుగా ఉన్న భార్యాభర్తలు ఇటీవల కలిసి మానుకోటలో నివాసం ఉంటున్నారు. అయితే ఆదివారం స్వగ్రామం బొల్లెపల్లికి చేరుకున్న యాదగిరి కుటుంబ కలహాలు జరుగుతున్నాయన్న మనోవేదనతో ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగాడు. మానుకోట ఏరియా ఆస్పత్రికి తరలించచారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మద్యానికి బానిసై ఒకరు..

గార్ల: మద్యానికి బానిసై జీవితంపై విరక్తి చెంది ఓ వ్యక్తి పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సోమవారం కోట్యానాయక్‌తండాలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలిలావున్నాయి. గార్ల మండలం కోట్యానాయక్‌తండాకు చెందిన భూక్యా బీమా(48) రెండేళ్లుగా మద్యానికి బానిసై ఈనెల 4వ తేదీ గడ్డిమందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. కుటుంబ సభ్యులు ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేస్తుండగా మృతిచెందాడు. మృతుడికి ముగ్గురు ఆడపిల్లలు సంతానం. మృతుడి తమ్ముడు హర్జి ఫిర్యాదు మేరకు ఎస్సై ఎస్‌కె యాకూబ్‌పాషా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.